

## వందే భారత్‌కు తప్పిన ముప్పు!

**ట్రాక్‌పై రాళ్లు, ఇనుప రాడ్‌ను గుర్తించి రైలును ఆపిన లోకో పైలట్**

న్యూఢిల్లీ, అక్టోబర్ 2: లోకో పైలట్ అప్రమత్తంగా వ్యవహరించటంతో ఉదయ్‌పూర్-జైపూర్ వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలుకు పెను ప్రమాదం తప్పింది. రైల్వే ట్రాక్‌పై అడ్డంగా బండరాళ్లు, ఇనుప రాడ్లు ఉండటాన్ని గుర్తించిన రైలు డ్రైవర్ అత్యవసర బ్రేక్స్ సాయంతో రైలును వెంటనే నిలిపివేశాడు. దీంతో ప్రమాదం తప్పింది. సోమవారం నాటి ఈ ఘటనకు సంబంధించి వీడియో ఒకటి సోషల్‌మీడియాలో వైరల్ అయ్యింది. ఉదయ్‌పూర్‌లో ఉదయం 7.50 గంటలకు బయల్దేరిన రైలు, 9.55 గంటలకు గంగరార్-సోనియాన్ సెక్షన్ వద్ద అత్యవసరంగా ఆపాల్సి వచ్చింది. స్థానిక పోలీసులు, రైల్వే పోలీసులు సంయుక్తంగా ఈ ఘటనపై దర్యాప్తు జరుపుతున్నారు.



## భారత దౌత్య కార్యాలయం ఎదుట ఖలిస్థాన్ మద్దతుదారుల నిరసన

లండన్, అక్టోబర్ 2: విదేశాల్లో భారత్‌కు వ్యతిరేకంగా ఖలిస్థాన్ మద్దతుదారులు రెచ్చిపోతున్నారు. తాజాగా లండన్‌లో భారత దౌత్య కార్యాలయం ఎదుట నిరసనకు దిగారు. హర్దీప్‌సింగ్ నిజ్జర్ ఫొటోలతో కూడిన ప్లకార్డులు, జెండాలు చేతబూని భారత్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సోమవారం దౌత్య కార్యాలయం వద్దకు పెద్ద సంఖ్యలో ఖలిస్థాన్ మద్దతుదారులు చేరుకున్నారు. దీంతో బ్రిటిష్ భద్రతా బలగాల్ని దౌత్య కార్యాలయం వద్ద మోహరించాల్సి వచ్చింది. రెండు రోజుల క్రితం యూకేలో భారత దౌత్యవేత్త విక్రమ్ దొరైస్వామిని స్కాట్లాండ్‌లోని గురుద్వారాలోకి ప్రవేశించకుండా ఖలిస్థాన్ మద్దతుదారులు అడ్డుకున్నారు. ఈ ఘటనపై భారత్ ఆగ్రహం వ్యక్తం చేసింది.

# ప్రాణం తీసిన జీపీఎస్!

- భారీ వర్షంలో గూగుల్ మ్యాప్స్ నమ్ముకుని డ్రైవింగ్
- నదిలోకి దూసుకెళ్లిన కారు
- ఇద్దరు వైద్యుల మృతి.. మరో ముగ్గురికి గాయాలు
- కేరళలోని ఎర్నాకుళంలో ఘటన
- వర్షంలో జీపీఎస్ వాడొద్దు
- పోలీసుల మార్గదర్శకాలు



పెరియార్ నదిలోకి దూసుకెళ్లిన కారు

కొచ్చి, అక్టోబర్ 2: భారీ వర్షంలో గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్ (జీపీఎస్)ను, గూగుల్ మ్యాప్స్‌ను నమ్ముకొని కారును నడిపినందుకు ఇద్దరు యువ వైద్యులు ప్రాణాలు కోల్పోయారు. మరో ముగ్గురు గాయపడ్డారు. వారు ప్రయాణిస్తున్న కారు నేరుగా పెరియార్ నదిలోకి దూసుకెళ్లడమే ఈ విషాదానికి కారణం. కేరళలోని ఎర్నాకుళం జిల్లాలో శనివారం అర్ధరాత్రి దాదాపు 12.30 గంటలకు ఈ దుర్ఘటన జరిగింది. త్రిసూర్ జిల్లాలోని ఓ ప్రైవేటు దవాఖానలో వైద్యులుగా పనిచేస్తున్న అద్వైత్ (29), అజ్మల్ (29) శనివారం రాత్రి విధులు ముగించుకుని హోండా సివిక్ కారులో ఇండ్లకు బయల్దేరారు. వీరితోపాటు డాక్టర్ తబ్సీర్, ఎంబీబీఎస్ విద్యార్థిని తమన్నా, నర్సు జిస్మాన్ కూడా ఆ కారులో ఎక్కారు. డ్రైవర్ సీటులో డాక్టర్ అద్వైత్ కూర్చున్నాడు. మర్నాడు అతని పుట్టినరోజు కావడంతో మార్గం మధ్యలో షాపింగ్ చేసి బయల్దేరారు. ఆ సమయంలో భారీ వర్షం పడుతుండటంతో రోడ్డు సరిగా కనిపించలేదు. దీంతో గూగుల్ మ్యాప్స్‌ను అనుసరిస్తూ కారును నడుపుతున్న అద్వైత్.. ఆ మార్గం మధ్యలో నీరు నిలిచి ఉన్న ఓ ప్రాంతాన్ని రోడ్డుగా భ్రమించాడు. కారును వేగంగా ఆ నీటిలోకి నడిపాడు. కానీ, అది పెరియార్ నది అని గుర్తించేలోపే ఆ కారు నీటిలో మునిగిపోయింది. దీంతో స్థానికులు స్పందించి ముగ్గురిని రక్షించారు. అద్వైత్, అజ్మల్ ప్రాణాలు కోల్పోయారు.

### వర్షాకాలంలో గూగుల్ మ్యాపుల వినియోగం వద్దు

ఈ దుర్ఘటన నేపథ్యంలో ప్రయాణాలకు టెక్నాలజీని ఉపయోగించడంపై కేరళ పోలీసులు సరికొత్త మార్గదర్శకాలను జారీచేశారు. ప్రత్యేకించి వర్షాకాలంలో జీపీఎస్‌ను, గూగుల్ మ్యాప్స్‌ను వినియోగించవద్దని సూచించారు. సాధారణంగా వానకాలంలో రోడ్డు మార్గాలను తరచుగా మళ్లించడం జరుగుతుందని, కానీ ఆ డైవర్షన్లు గూగుల్ మ్యాపుల్లో కనిపించకపోవచ్చని హెచ్చరించారు. 'ప్రస్తుత కాలంలో డ్రైవింగ్‌కు గూగుల్ మ్యాప్‌లు ఉపయుక్తమైనవే అయినప్పటికీ వాటిని అనుసరిస్తూ తెలియని మార్గాల్లో వాహనాలను నడపడం, ముఖ్యంగా వర్షాకాలంలో గూగుల్ మ్యాప్‌లను నమ్ముకోవడం ఏమాత్రం శ్రేయస్కరం కాదని స్పష్టం చేశారు.

## జింబాబ్వేలో విమాన ప్రమాదం.. భారత వ్యాపారవేత్త మృతి

**అతడి కుమారుడు కూడా దుర్మరణం**

హరారే, అక్టోబర్ 2: జింబాబ్వేలో జరిగిన విమాన ప్రమాదంలో భారత్‌కు చెందిన మైనింగ్ కింగ్ హర్పాల్ రాంధావా దుర్మరణం పాలయ్యారు. నైరుతి జింబాబ్వేలోని మషావాలో ఉన్న ఓ డైమండ్ మైనింగ్ వద్ద చోటుచేసుకున్న ఈ ప్రమాదంలో అతడి కుమారుడు సహా మొత్తం ఆరుగురు మృతి చెందారు. హరారే నుంచి మురోవాలోని డైమండ్ మైన్‌కు వెళ్తుండగా శుక్రవారం ఈ ప్రమాదం జరిగింది. సాంకేతిక లోపం కారణంగా వారు ప్రయాణిస్తున్న ప్రైవేట్ విమానం కుప్పకూలిపోయింది. దీంతో హర్పాల్, అతడి కుమారుడు అమేర్ సహా ఆరుగురు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. విమాన ప్రమాదంపై విచారణ జరుగుతున్నది. భారత్‌కు చెందిన హర్పాల్ రాంధావా రియో జిమ్ అనే మైనింగ్ కంపెనీకి అధిపతి. ఆయన కంపెనీ బంగారం, బొగ్గు, నికెల్, కాపర్ తదితర ఖనిజాలను వెలికితీస్తుంది. ప్రస్తుతం ఆయన జెమ్ గ్రూప్‌కి చైర్మన్‌గానూ వ్యవహరిస్తున్నారు.



జింబాబ్వేలోని మషావాలో కుప్పకూలిన విమానం. హర్పాల్ రాంధావా (ఫైల్)




ఢిల్లీలోని రాజ్‌ఘాట్ వద్ద ఆందోళన చేస్తున్న టీఎంసీ నేతలు

## ఉపాధి బకాయిలు చెల్లించాల్సిందే

- కేంద్రానికి తృణమూల్ డిమాండ్
- ఢిల్లీలోని రాజ్‌ఘాట్ వద్ద నిరసనలు

న్యూఢిల్లీ, అక్టోబర్ 2: ఉపాధి హామీ పథకం కింద పశ్చిమ బెంగాల్‌కు రావాల్సిన 15వేల కోట్ల రూపాయల్ని కేంద్రం విడుదల చేయటం లేదంటూ తృణమూల్ కాంగ్రెస్ పార్టీ పెద్ద ఎత్తున నిరసన చేపట్టింది. ఎంపీ అభిషేక్ బెనర్జీ నేతృత్వంలో సోమవారం న్యూఢిల్లీలోని రాజ్‌ఘాట్ వద్ద సాగిన నిరసన కార్యక్రమానికి పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, మంత్రులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఎంపీ అభిషేక్ బెనర్జీ నలుపు రంగు ప్లకార్డులు ప్రదర్శిస్తూ, బెంగాల్‌కు నిధులు విడుదల చేయాలని, లక్షా 15వేల కుటుంబాలకు చెందిన రూ.15వేల కోట్లు వెంటనే విడుదల చేయాలని మోదీ సర్కార్‌ను డిమాండ్ చేశారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ, పీఎం ఆవాస్ యోజన పథకాల కింద పశ్చిమ బెంగాల్‌కు రావాల్సిన నిధులను కేంద్రం కావాలనే అడ్డుకుంటున్నదని గత కొంత కాలంగా అధికార తృణమూల్ పార్టీ ఆరోపిస్తున్నది. 'ఉపాధి హామీ పథకాన్ని కేంద్రం నీరుగార్చుతున్నది. రాజకీయ లబ్ధిని దృష్టిలో పెట్టుకొని పథకాల్ని అమలుజేస్తున్నది. ఇది ప్రజాస్వామ్యమా? పేద ప్రజల్ని, మహాత్మా గాంధీని అవమానించటం కాదా?' అని తృణమూల్ పార్టీ అధికార ప్రతినిధి బిశ్వజిత్ దేవ్ విమర్శించారు.

### 74 లక్షల వాట్సాప్ ఖాతాలపై నిషేధం

న్యూఢిల్లీ, అక్టోబర్ 2: ఈ ఏడాది ఆగస్టు నెలలో భారత్‌లో 74 లక్షల వాట్సాప్ ఖాతాలను బ్యాన్ చేసినట్టు 'మెటా' వెల్లడించింది. ఐటీ నిబంధనల ప్రకారం ఈ చర్యలు చేపట్టినట్టు తాజా నివేదికలో సంస్థ పేర్కొన్నది. అసభ్య, అభ్యంతరకర సందేశాలు, వీడియోలు పంపేందుకు 'వాట్సాప్'ను వాడుతున్నారని, దీనిని అడ్డుకునేందుకు ఖాతాలపై బ్యాన్ విధిస్తున్నట్టు మెటా సోమవారం ఓ ప్రకటన విడుదల చేసింది. ప్రతి ఒక్క ఖాతాదారుడి 'యూజర్ సేఫ్టీ రిపోర్ట్'లో ఫిర్యాదులకు సంబంధించిన వివరాలుంటాయని, దీని ఆధారంగా చర్యలు చేపట్టినట్టు సంస్థ తెలిపింది. దీంతోపాటు వాట్సాప్ వేదికపై అభ్యంతరకర చర్యల్ని అడ్డుకునేందుకు సంస్థ తనంతట తానుగా 35 లక్షల ఖాతాలపై నిషేధం విధించినట్టు వివరించింది.

### 'మియా'ల ఓట్లు బీజేపీకి అక్కర్లేదు: హిమంత

గువాహటి, అక్టోబర్ 2: బెంగాలీ మాట్లాడే 'మియా' ముస్లింల ఓట్లు బీజేపీకి అవసరం లేదని అస్సాం సీఎం హిమంత బిశ్వశర్మ అన్నారు. కుటుంబ నియంత్రణ పాటించాలని, బాల్య వివాహాల వంటి పద్ధతులను పక్కనపెట్టి, తమను తాము సంస్కరించుకొనేంత వరకు వచ్చే పదేండ్ల పాటు 'చార్(నదీ తీరం)' ప్రాంత మియా ప్రజల ఓట్లు తమకు అక్కర్లేదని ఆదివారం వ్యాఖ్యానించారు. అయితే మియా ప్రజలు తనకు, ప్రధాని మోదీకి, బీజేపీకి మద్దతు ఇస్తున్నారని, వారు ఓటు వేయకుండా కమలం పార్టీకి అనుకూలంగా తమ మద్దతు కొనసాగించవచ్చునని చెప్పుకొచ్చారు.

### మోస్ట్‌వాంటెడ్ ఐఎస్ ఉగ్రవాది అరెస్టు

న్యూఢిల్లీ, అక్టోబర్ 2: మోస్ట్ వాంటెడ్ ఐఎస్ ఉగ్రవాది షానవాజ్‌ను ఢిల్లీ పోలీసులు అరెస్టు చేశారు. పుణె పోలీసుల కస్టడీ నుంచి తప్పించుకున్న అతడు ఢిల్లీలో రహస్య జీవనం సాగిస్తున్నాడు. అతడి తలపై రూ.3 లక్షల రివార్డు ఉన్నది. వృత్తిరీత్యా ఇంజినీర్ అయిన షానవాజ్‌ను ఆదివారం రాత్రి ఢిల్లీ ప్రత్యేక సెల్ పోలీసులు అరెస్టు చేశారు. షానవాజ్ వద్ద కొన్ని రసాయనాలు, పేలుడు పదార్థాలు లభించాయని, వాటిని స్వాధీనం చేసుకున్నామని పోలీసులు వెల్లడించారు. అతడితోపాటు మరో ఇద్దరిని అరెస్ట్ చేసినట్టు చెప్పారు.

### 'పశ్చిమ యూపీని ప్రత్యేక రాష్ట్రం చేయాలి'

లక్నో: ఉత్తరప్రదేశ్ రాష్ట్ర విభజనపై కేంద్ర మంత్రి సంజీవ్ బల్యాన్ వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. మీరట్ రాజధానిగా పశ్చిమ ఉత్తరప్రదేశ్ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటుచేయాలని ఆయన పేర్కొన్నారు. మీరట్‌లో ఆదివారం జరిగిన ఇంటర్నేషనల్ జాట్ పార్లమెంట్‌లో పాల్గొన్న ఆయన ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. 'పశ్చిమ యూపీ రాష్ట్రం కావాలి, మీరట్ దాని రాజధాని కావాలి' అని అన్నారు. 'ఈ రీజియన్‌లో 8 కోట్ల మంది జనాభా ఉన్నారు. హైకోర్టు అయితే ఇక్కడికి 750 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ నేపథ్యంలో ప్రత్యేక రాష్ట్రం డిమాండ్ పూర్తిగా సమర్థనీయమే' అని వ్యాఖ్యానించారు.

### తమిళ నాడులో నకిలీ సాధువులపై తనిఖీలు

తిరువన్నామలై, అక్టోబర్ 2: నకిలీ సాధువులను గుర్తించేందుకు తమిళనాడులో పోలీసులు ప్రత్యేక కార్యక్రమం చేపట్టారు. తిరువన్నామలై జిల్లాలోని అరుణాచలేశ్వర్ ఆలయం సమీపంలో వేలి ముద్రల సేకరణ డ్రైవ్‌ను ప్రారంభించారు. సాధువుల బ్యాక్‌గ్రౌండ్, వారికి ఏమైనా నేర చరిత్ర ఉన్నదా? అనేది తెలుసుకొనేందుకు ఈ ప్రక్రియ చేపట్టినట్టు పోలీసులు తెలిపారు. అరుణాచలేశ్వర్ ఆలయం కొండ చుట్టూ గిరిప్రదక్షిణం చేసే భక్తులను కొంతమంది నకిలీ సాధువులు అడ్డుకొంటూ, డబ్బులు డిమాండ్ చేస్తున్నారనే ఫిర్యాదులు వచ్చాయి. ఈ నేపథ్యంలో పోలీసులు తాజా చర్య చేపట్టారు.

### భగవద్గీతపై పేటెంట్ లేదు: ఢిల్లీ హైకోర్టు

న్యూఢిల్లీ, అక్టోబర్ 2: మతగ్రంథాలపై పేటెంట్ ఎవరికీ ఉండదని, అయితే.. బీఆర్ చోప్రా తీసిన మహాభారత్, ఫిలిం డైరెక్టర్ రమానంద్ సాగర్ తీసిన రామాయణ్ సీరియల్స్‌కు పైరసీ నుంచి రక్షణ ఉంటుందని ఢిల్లీ హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. భక్తివేదాంత బుక్ ట్రస్ట్ రచనలకు కూడా ఇదే వర్తిస్తుందని ధర్మాసనం పేర్కొన్నది. భక్తివేదాంత బుక్ ట్రస్ట్ పుస్తకాల్లోని కంటెంట్‌కు పేటెంట్ హక్కులు వర్తిస్తాయని, ఈ పుస్తకాల్లోని కంటెంట్‌ను తీసుకోకుండా కొన్ని సంస్థల్ని నిరోధిస్తూ ధర్మాసనం తీర్పు వెలువరించింది. ఈ అంశంపై ట్రస్ట్ న్యాయస్థానాన్ని ఆశ్రయించగా, 'గ్రంథాన్ని బోధించే, వివరించే రచనల అసలు భాగాలకు కాపీరైట్ వర్తిస్తుంది. వీటిపై పైరసీని అనుమతించం' అని హైకోర్టు వ్యాఖ్యానించింది. ప్రింట్, ఆడియో, విజువల్..ఇలా ఏ రూపంలోనూ ట్రస్ట్ బుక్స్‌ను కాపీరైట్ చేయరాదని, ఆన్‌లైన్ వెబ్‌సైట్స్, మొబైల్ అప్లికేషన్స్, వెబ్‌లింక్స్, సోషల్‌మీడియాలో చూపరాదని ధర్మాసనం ఉత్తర్వులు జారీచేసింది. గూగుల్, మెటాలకు కోర్టు ఆదేశాలు జారీచేసింది.

